క్లుప్తంగా

కొణిదెనలో జగనన్న ఆరోగ్య సురక్ష నేడు

బల్లికురవ : మండలంలోని కొణిదెన గ్రామంలోని ఉన్నత పాఠశాలలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సీహెచ్ కృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయ పరిధిలోని కొనిదెన, గంగపాలెం గ్రామాల్లో దీర్ఘకాలిక వ్యాధులు, కంటి సమస్యలతో బాధపడుతున్న రోగులు శిబిరానికి వచ్చి వైద్య పరీక్షలు చేయించు కోవాలని ఎంపీడీవో కోరారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం



మొక్కలు నాటేందుకు సిద్ధమైన సేవాదళ్ సభ్యులు

చినగంజాం: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత.. మొక్కల పెంపకంతోనే పర్యావరణ రక్షణ సాధ్యపడుతుందని యూత్ లీడర్ కృష్ణ అన్నారు. ఆదివారం మండలంలోని రాజుబంగారుపాలెంలో ప్రతి నెల 2వ ఆదివారం సత్యసాయి సేవాదళ్ ఆధ్వర్యంలో యూత్‌డేను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల ఆధ్యాత్మిక కన్వీనర్ సాయిరాం, సేవాదళ్ కోఆర్డినేటర్ ఈశ్వరరెడ్డి, సేవాదళ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

జీవామృతంతో అధిక దిగుబడులు



జీవామృతం తయారు చేస్తున్న సిబ్బంది

మేదరమెట్ల: జీవామృతంతో అధిక దిగుబడులు సాధించవచ్చని కొరిశపాడు యూనిట్ ఇన్‌చార్జి ఎ. శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం మండలంలోని కొరిశపాడు యూనిట్ తిమ్మనపాలెం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ అధికారులు సీహెచ్ సౌజన్య, సీహెచ్ లిఖితలు సిబ్బందికి జీవామృతం తయారీ, ఉపయోగాలు వివరించారు. రావినూతల గ్రామం ఆర్‌బీకె వద్ద ఎస్ఎఫ్ ఐటీసీ రవికుమార్, అద్దంకి డివిజన్ ఎంటీ అశోక్ కుమార్‌లు ఐసీఆర్పీలకు డీపీఎం, ఏటీఎం పద్ధతుల గురించి వివరించారు. రైతులకు కషాయాల గురించి వివరించి ఎన్‌పీఎం షాపుల గురించి తెలిపేలా ఐసీఆర్‌పీలు కృషిచెయ్యాలన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



విద్యార్థులతో మాట్లాడుతున్న లైబ్రేరియన్ భాస్కరరెడ్డి

సంతమాగులూరు (అద్దంకి): పుస్తక పఠనంతో విజ్ఞానం కలుగుతుందని గ్రంథపాలకుడు భాస్కరరెడ్డి అన్నారు. ఆయన ఆదివారం చదవడం మాకుఇష్టం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా హాజరైన విద్యార్థులకు పుస్తకాలను చదివించడం, వివిధ రకాల పుస్తకాల గురించి వివరించారు. ఏ పుస్తకాలు చదవాలి, వాటిని చదవడం వలన కలగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం, దక్షిణాయనం, భాద్రపద మాసం, పుష్యమి నక్షత్రం, ఏకాదశి తిథి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర ఆదివారం తెలిపారు. ఉదయం బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

జిల్లా ఎస్పీకి పోలీసుల అభినందనలు



డీఎస్పీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న డీఎస్పీ, పోలీసులు

చీరాల: బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌కు నేషనల్ పోలీస్ అవార్డు వచ్చిన సందర్భంగా చీరాల సబ్‌డివిజన్ కార్యాలయంలో ఆదివారం సామాజిక కార్యకర్త తేళ్ల రాంబాబు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. డీఎస్పీ ప్రసాదరావు మాట్లాడుతూ ఎస్పీకు నేషనల్ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఆయన మరెన్నో అవార్డులను అందుకోవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐ సోమశేఖర్, ఈపూరుపాలెం ఎస్సై జనార్దన్, వేటపాలెం ఎస్సై సురేష్, ఒన్‌టౌన్ ఎస్సై బాషా, జేఏసీ అధ్యక్షుడు డి.మార్కు తదితరులు పాల్గొన్నారు.

మలుపుల్లో ప్రమాదాల పిలుపులు

- కూలేదశలో వల్లాపల్లి సింగిల్ బ్రిడ్జి
- సైడ్‌కు యాంగ్లర్లు లేక ప్రమాదాలు
- నాలుగేళ్లలో 12 మంది మృతి
- నిద్రపోతున్న అధికారులు

బల్లికురవ: తరచూ జరుగుతున్న ప్రమాదాలు అధికారుల్లో చలనం రావడం లేదు. మాకేందుకులే అని మిన్నకుండి చోద్యం చూస్తున్నారే తప్ప పట్టించుకుందామన్న ఆలోచన రావడం లేదు. ఫలితంగా ఆ వంతెన మీద ప్రయాణం చేస్తున్న వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. బల్లికురవ-అద్దంకి ఆర్అండ్‌బీ రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించి నాలుగేళ్లయింది. ఈరోడ్డు సాగర్ అద్దంకి బ్రాంచ్ కాలువను దాటేచోట ధర్మవరం-వల్లాపల్లి గ్రామాల మధ్య ఐదున్నర దశాబ్దాల క్రితం బాటసారులు, రైతులకు సింగిల్ బ్రిడ్జి ఎన్ఎస్‌పీ అధికారులు నిర్మించారు. డబుల్ రోడ్డుగా విస్తరించినా జీర్ణావస్థకు చేరిన సింగిల్ బ్రిడ్జిని అభివృద్ధి పర్చలేదు. ఈ పరిస్థితులకు తోడు బ్రిడ్జికి ఇరువైపుల ఉన్న యాంగ్లర్స్ పాడైపోయాయి. దీంతో ఇక్కడా తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అద్దంకి, బల్లికురవ, సంతమాగులూరు మండలాలోని 30 గ్రామాల వాహనదారులు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు.

12 మంది మృతి, 40 మంది వరకు గాయాలు..

2019 జూన్‌లో ఓ ప్రయివేటు పాఠశాల బస్సు బ్రిడ్జి వద్ద కాలువలో పడింది. బస్సులో 20 మంది విద్యా



వల్లాపల్లి సమీపంలో ఏబీసీ కాల్వపై నిర్మించిన సింగిల్ బ్రిడ్జి



కాల్వలో పడిన క్షతగాత్రుబొని స్ట్రెచర్‌తో బయటకు మోసుకొస్తున్న రైతులు (ఫైల్)

ర్థులు ఉన్నారు. 10 మంది స్వల్పగాయాలతో బయట పడ్డారు. గతేడాది ధర్మవరం గ్రామానికి చెందిన గుంజి శేషయ్య, స్థానిక ఈర్లకొండ అమృతా క్వారీలో క్యాషియర్‌గా పని చేస్తున్న టీ శ్రీనివాసరావు బైకు అదుపుతప్పి కాల్వలో పడి చనిపోయాడు. వారం రోజుల క్రితం తాళ్లూరు మండలం గంగవరం గ్రామానికి చెందిన ఇరువురు వ్యక్తులు బైకుపై బల్లికురవ వస్తూ బ్రిడ్జిపై నంచి కాలువలో పడ్డారు. గత నాలుగు సంవత్సరాల్లో 40 మంది వరకు గాయాలపాలయ్యారు. కనీసం హెచ్చరిక బోర్డులు లేకపోవడం శోచనీయం.

రూ. 30 కోట్లతో రోడ్డు అభివృద్ధి..

బల్లికురవ-అద్దంకి ఆర్అండ్‌బీ రోడ్డును 3 బిట్లుగా రూ. 30 కోట్లతో అభివృద్ధి పరిచారు. జీర్ణావస్థతో కూలేదశతో ప్రమాదాలు పొంచి ఉన్న ఈ బ్రిడ్జిని మాత్రం అధికారులు అభివృద్ధి చేయలేదు. ఇక్కడ మలుపు ఉండటంతో ఎదురుగా వచ్చే వాహనాలు సైతం కనడబటం లేదు. ప్రమాదాలు సంభవించినప్పుడు అయ్యో పాపం అంటున్న అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టటం లేదు. కనీసం బ్రిడ్జికి ఇరువైపుల యాంగ్లర్లు ఏర్పాటు చెయ్యాలని వాహనదారులు, ప్రయాణికులు వేడుకుంటున్నారు. మలుపులో కొత్త వ్యక్తులు కారుతో సహ కాలువలో పడిన ఘటనలు అనేకం ఉన్నాయి. ఈ విషయాలపై ఆర్అండ్‌బీ జేఈ శివన్నారాయణను వివరణ కోరగా బ్రిడ్జి నిర్మాణానికి ప్రపంచ బ్యాంకు నిధులకు రూ. 1.5 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. పనులు చేపట్టేలోపు వాహనదారులు అప్రమత్తంగా ప్రయాణాలు సాగించాలన్నారు.



యాంగ్లర్లు లేక మలుపును గుర్తించలేక కాల్వలో పడిన కారు (ఫైల్)

తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి..



వల్లాపల్లి సింగిల్ బ్రిడ్జి వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవటం లేదు. పగలు ప్రమాదాలు సంభవిస్తే పొలాల్లో ఉన్న రైతులు, కూలీలు క్షతగాత్రులను కాపాడుతున్నారు. రాత్రిళ్లు జరిగితే ఇంతే సంగతులు బతికుంటే బయటకు రావటమే. అధికారులు ఇప్పటికైనా స్పందించి యాంగ్లర్లు ఏర్పాటు చేయాలి.

బాదం హనుమారెడ్డి, వల్లాపల్లి

యాంగ్లర్లు ఏర్పాటు చేయాలి..



అధికారులు బ్రిడ్జికి రెండు వైపులా యాంగ్లర్లు ఏర్పాటుతో మలుపును గుర్తించే విధంగా సూచిక బోర్డులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తే ప్రమాదాలు నివారించవచ్చు. జీర్ణావస్థకు చేరిన బ్రిడ్జి స్థానంలో నూతన బ్రిడ్జి మలుపు లేకుండా నిర్మించాలి.

మాదాల లోకేశ్వరరావు, గుంటుపల్లి

అభయాంజనేయస్వామి విగ్రహం ఏర్పాటు



విగ్రహం కోసం ఏర్పాటు చేసిన దిమ్మె



ప్రయాణికుల కోసం రావిచెట్టు నుంచి ఏర్పాటు చేసిన అరుగు

- రూ. 20 లక్షలతో విగ్రహం, ప్రతిష్టకు ఏర్పాట్లు

బల్లికురవ: మండలంలోని పాత మల్లాయపాలెం బస్టాప్ వద్ద ఆ గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్దపాటి చంద్రశేఖర్ సుమారు రూ. 20 లక్షలతో అభయాంజనేయస్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. గ్రామానికి చెందిన సింగం వెంకట నారాయణ శర్మ కుమారులు సుమారు 5 సెంట్ల స్థలాన్ని విగ్రహం ఏర్పాటుకు ఉదారంగా ఇచ్చారు. ఈ స్థలంలోనే బస్సుల కోసం ప్రయాణికులు వేచి ఉండేందుకు రావిచెట్టును నాటారు. రావి చెట్టువద్ద ప్రయాణికులు కూర్చునేందుకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు సువిశాలమైన అరుగు ఏర్పాటుతో పాటు అభయాంజనేయస్వామి విగ్రహం ఏర్పాటుకు 18 అడుగుల వెడల్పు 15 అడుగుల పొడవున దిమ్మె నిర్మించారు. ఈ నెల 27 వతేదీ ఉదయం 8 గంటలకు రాజుపాలెం గ్రామానికి చెందిన ఐనవోలు సీతారామాచార్యులుచే విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. 25న యాగశాల ప్రవేశంతో ప్రతిష్టకు అంకురార్పన చేసి 26న గ్రామోత్సవం జలాధి, క్షీరాధివాసం, తదుపరి 27న ప్రతిష్ట మహోత్సవాలు, శాంతికళ్యాణం, అన్నదానం నిర్వహిస్తున్నట్లు విగ్రహ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతిష్టలో భాగంగా ఆలయానికి వచ్చే బస్సు రాకకోసం వేచి ఉండే ప్రయాణికుల కోసం గ్రామంలోని ఆర్వో ప్లాంట్ నుంచి పైపులైన్ ద్వారా మినిట్యాంకు కుళాయిలు ఏర్పాటు చేస్తున్నట్లు శంకర్ తెలిపారు. బస్సుల రాక కోసం వేచిఉండే ప్రయాణికుల కోసం అరుగు, మినరల్ వాటర్, అభయాంజనేయ స్వామి విగ్రహం ఏర్పాటు చేస్తున్నందుకు శంకర్‌ను గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందిస్తున్నారు.

ఆర్థిక అసమానతలపై ఇంటింటి సర్వే

కారంచేడు: కారంచేడు కేంద్రంగా మండలంలోని కారంచేడులో నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్)ను ఆదివారంతో ముగించారు. కారంచేడు గ్రామంలో ఈనెల 5వ తేదీ నుంచి కొన్ని గృహాలను ఎంపిక చేసుకొని ఈ సర్వే టీం ఇంటింటికి వెళ్లి ఇంటి యజమాని ఆర్థిక పరిస్థితులు, కుటుంబ పోషణ విషయాలు, వ్యక్తిగత విషయాలు, ఆహార నియమాలు, బీమాలు, వాటి ఉపయోగాలు వంటి అనేక విషయాలపై ప్రజలతో మాట్లాడారు. వారి నుంచి సమాధానాలు విని వాటిని నమోదు చేసుకున్నారు. ప్రతి కుటుంబంలో ఉండే ఆర్థిక అసమానతలు, కుటుంబ, వ్యక్తిగత వ్యవహారాలపై పూర్తిగా అధ్యయనం చేసేందుకు ఈ సర్వేలు దోహదపడతాయని సర్వే టీం బాపట్ల డీఎంహెచ్‌వో కార్యాలయ ఎస్ఓ వేణు తెలిపారు. కార్యక్రమంలో కారంచేడు పీహెచ్‌సీ సీహెచ్ఓ మల్లికార్జునరావు, డాక్టర్ జెస్సీ, నాగమణి, వాసవి, కళావతి, హెచ్‌వీ ఎం వీరమ్మ, ఎంపీహెచ్ఎస్ శ్రీనివాసరావు, టీం సభ్యులు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



కారంచేడులో సర్వేలో పాల్గొన్న హెల్త్ సర్వే టీం సభ్యులు

పార్టీ బలోపేతానికి సమష్టి కృషిచేయాలి

- నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేష్

చీరాల: నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీని మరింతగా బలోపేతం చేయడానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పని చేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అన్నారు. వైఎస్సార్ సీపీ పట్టణ-1 అధ్యక్షుడిగా ఎన్నికైన కోండ్రు బాబ్జికి ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని శనివారం రాత్రి నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన పార్టీ నాయకులనుద్దేశించి మాట్లాడారు. రాష్ట్రంలో పార్టీ అధికారం చేపట్టిన నాటి నుంచి నేటి వరకు ప్రజల సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ పథకాలను, కార్యక్రమాలు చేపట్టిందన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అనునిత్యం ప్రజాశ్రేయస్సు కోసం పాటు పడుతూ కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. అర్హతే ప్రామాణికంగా పథకాలను అందిస్తున్న ప్రభుత్వం వైఎస్సార్ సీపీదేనన్నారు. మేనిఫెస్టోలో చెప్పిన విధంగా పూర్తిస్థాయిలో అమలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. అటువంటి పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకువచ్చేందుకు రానున్న ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టి కృషి చేసి పార్టీని మరింతగా బలోపేతం చేయాలన్నారు. అనంతరం కోండ్రు బాబ్జిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, ఎస్టీ సెల్ అధ్యక్షులు నల్లబోతుల రాజ్‌కుమార్, కౌన్సిలర్లు గొట్టిపాటి ఎబినేజర్, బత్తుల అనిల్, చీమకుర్తి బాలకృష్ణ, గుంటూరు ప్రభాకరరావు, పి.సుబ్బయ్య, పార్టీ నాయకులు యాతం మేరిబాబు, శిఖా సురేష్, కోలా శివ, ఎస్.అనిల్, షేక్ రియాజ్, కె.విజయప్రకాష్, టి.సుధీర్, పి.భూషణం, వి.రత్నం, బి.అనిల్, జంగా ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న నియజకవర్గ ఇన్‌చార్జి వెంకటేష్

వైద్య శిబిరంలో 110 మందికి పరీక్షలు

చీరాల అర్బన్: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రోటరీ సామాజిక భవనంలో ఆదివారం ఒంగోలు స్మార్ట్ విజన్ కంటి హాస్పిటల్, చైతన్య కార్డియాక్ సెంటర్ సహకారంతో ఉచిత కంటి, గుండె వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ బి.నాగమాధురి, డాక్టర్ బీఎంవీ కృష్ణచైతన్య బృంద పర్యవేక్షణలో 110 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. కంటి పరీక్షలు, కంటి శుక్లాల పరీక్ష నిర్వహించారు. గుండెకు సంబంధించి బీపీ, ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. రోటరీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాల్లో భాగంగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు అధ్యక్షులు మామిడాల శ్రీనివాసరావు తెలిపారు. రోగులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సదుపాయాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు పోలుదాసు రామకృష్ణ, జీవై ప్రసాద్, వలివేటి మురళీకృష్ణ, డీపీ సురేష్, ఎంవి రామారావు, డాక్టర్ బాబూరావు, లక్ష్మీ ప్రతాప్, చిన్ని లీలాధరరావు, పూర్ణచంద్రరావు, హరినారాయణ, మోహనరావు, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

జగనన్న పాలనలో మహిళలకే అగ్రపీఠం



సమస్యలు తెలుసుకుంటున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

- గడప గడపలో శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

బల్లికురవ: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో మహిళలు ఆర్థికంగా ఎదగాలన్న సంకల్పంతో పథకాలన్నీ మహిళలకే వర్తించేలా చేశారని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా ఉప్పుమాగులూరు సచివాలయం పరిధిలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును తెలుసుకున్నారు. గ్రామంలోని సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు చేపట్టారు. రాజకీయంగా, ఆర్థికంగా మహిళలు ఎదగాలన్న ఉద్దేశంతోనే ఇంటి పట్టాలు, పక్కా గృహాలు, పలు పథకాలు మహిళల పేరుతోనే అందిస్తున్న ఘనత జగనన్నకే దక్కిందన్నారు. అధికార వికేంద్రీకరణతో గ్రామాలోని ప్రజలు ఇబ్బందులు పడకూదని గ్రామ, వార్డు సచివాలయ ఏర్పాటుతో అన్ని రకాల సేవలు అందిస్తున్నారని త్వరలో పొలాలు, స్థలాల రిజిస్ట్రేషన్లు కూడా సచివాలయాలో చేస్తారని చైతన్య చెప్పారు. ప్రతిపక్షాలైన టీడీపీ, జనసేన ఎన్ని కుట్రలు పన్నినా ప్రజా సంక్షేమం కోసం నిరతరం శ్రమించే జగనన్నను రెండోసారి ముఖ్యమంత్రిగా చెయ్యాలని ప్రజలు ఎదురుచూస్తున్నారని చైతన్య అన్నారు. కార్యక్రమంలో పార్టీ బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లి అంజనీ ప్రసాదరెడ్డి, గ్రామ సర్పంచ్ డీ.మహాలక్ష్మమ్మ, స్థానిక నేతలు దేవినేని కృష్ణబాబు, బొడ్డపాటి లక్ష్మారెడ్డి, తాటి సుబ్బారావు, వజ్రాల వెంకటరామిరెడ్డి, ఒంటరి వెంగయ్య, సిరిమళ్ల సురేష్, గ్రామ పంచాయితీ సెక్రటరీ సీహెచ్ వరప్రసాదరెడ్డి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

ఇంకొల్లు (చినగంజాం): అక్రమంగా ఆటోలో తరలిస్తున్న పేదల బియ్యం 100 బస్తాలను పౌరసరఫరాల శాఖాధికారులు వలపన్ని పట్టుకున్నారు. ఆదివారం రాచపూడి నుంచి ఇంకొల్లు మీదుగా కారంచేడు మండలం స్వర్ణ గ్రామానికి తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ముందస్తు సమాచారంతో పట్టుకున్నామని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ గీతారాణి తెలిపారు. ఆటోతో పాటు ఆటో డ్రైవర్‌ను కూడా అదుపులోకి తీసుకున్నామన్నారు. పంచనామా అనంతరం బియ్యం ఉన్న మినీ లారీని ఇంకొల్లు పోలీస్‌స్టేషన్‌కు అప్పగించామన్నారు. నిందితులపై 6-ఏ కేసు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు.



రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ఆటో

సర్పంచ్ కుమార్తెకు వైద్య పీజీలో సీటు



ఎం పావనీశ్రీ

కారంచేడు: మండలంలోని జరుబులవారిపాలెం గ్రామ సర్పంచ్ మాదాసు కుమారి-మాదాసు సుబ్బారావుల కుమర్తె డాక్టర్ మాదాసు పావనీశ్రీకి వైద్య రంగంలో పీజీ చదివేందుకు ఎంపిక య్యింది. పావనీశ్రీ సాక్షితో మాట్లాడుతూ గ్రామానికి చెందిన నేను దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పథకాలతో ఎంబీబీఎస్ పూర్తి చేశానన్నారు. ప్రస్తుతం కృష్ణాజిల్లా గుడివాడ సమీపంలో ఒక పీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చొరవతో కొద్ది కాలంలోనే తనకు పీజీ సీటు కూడా వచ్చిందన్నారు. తనకు ఎంతో ఇష్టమైన గైనకాలజీలో పీజీ (ఎంఎస్) చేసేందుకు వరంగల్ కాకతీయ యూనివర్సిటీ నుంచి లేఖ వచ్చిందని ఎంతో సంతోషం వ్యక్తం చేసింది. తన ఉన్నత భవిష్యత్‌కు తోడ్పాటునందించిన డాక్టర్ వైఎస్సార్ కుటుంబానికి కృతజ్ఞతగా ఉంటానని పావనిశ్రీ తెలిపింది.

కల్తీ పురుగు మందులు అమ్మితే చర్యలు

జే.పంగులూరు: రైతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వ్యవసాయ అధికారులు ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేశారు. ఆదివారం చందలూరు గ్రామంలోని వెంకటరమణ ట్రేడర్స్ ఎరువుల షాపును తనిఖీ చేసి, షాపులో ఉన్న బెనివియా పురుగుల మందును పరిశీలన నిమిత్తం మూడు బాటిల్స్ తీసుకువెళ్లారు. వ్యవసాయశాఖ ఏడీఏ శ్రీనివాసరావు మాట్లాడుతూ వెంకటరమణ ట్రేడర్స్‌లో బెనివియా పురుగుల మందు, మిరప పైరులో పురుగులను నివారించలేక పోతుందని, ఇది నకిలీదేమోనని పంగులూరుకు చెందిన ఒక మిర్చి రైతు వ్యవసాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశాడని తెలిపారు. ఏడీఏతో పాటు పంగులూరు మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి వెంకటరమణ షాపును తనిఖీ చేశారు. షాపు యజమాని 25 బాటిళ్లు తీసుకొచ్చాడని, వాటిలో నాలుగు అమ్మగా, ఇంకా 21 బాటిళ్లు మిగిలి ఉన్నాయన్నారు. మిగిలిన 21 బాటిళ్లలో మూడిటిని శాంపిళ్లుగా తీసుకెళ్తున్నామన్నారు. పరీక్షలో ఏదైనా తేడా వస్తే షాపు యజమానిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. పురుగు మందుల దుకాణంలో కల్తీ మందులు, విత్తనాలు తెచ్చి అమ్మితే వారిపై కఠనమైన చర్యలు తీసుకొని లైసెన్స్ రద్దు చేస్తామని ఆయన హెచ్చరించారు.



దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

యువత సన్మార్గంలో పయనించాలి



వాక్య సందేశం అందిస్తున్న డాక్టర్ ఐజక్ కిమ్

చీరాల రూరల్: నేటి యువత తమ దైనందిన జీవన విధానంలో దేవుడి మీద భయభక్తులు కలిగి సన్మార్గంలో పయనించాలని ఢిల్లీ గ్లోబల్ క్రిస్టియన్ ఎంపవర్‌మెంట్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ ఐజక్ కిమ్ సూచించారు. స్థానిక చర్చి కాంపౌండ్‌లోని సెయింట్ మార్క్స్ సెంటినరీ లూథరన్ చర్చిలో ఆదివారం యువజనుల ఆదివారం (యూత్ సండే) నిర్వహించారు. ముందుగా చర్చి పాస్టర్లు రెవరెండ్ కొమ్మిన జోసఫ్ కేరి, పిల్లి దేవదాసులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. యూత్ సభ్యులు సంగీతాల మధ్య దేవుడి గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో చర్చి ట్రెజరర్ పేర్లి ఆనంద్‌బాబు, యూత్ ప్రెసిడెంట్ టీ అజయ్, పీసీసీ, ఎల్‌సీసీ పాల్గొన్నారు.

లారీ ఢీకొని మహిళకు గాయాలు

మార్టూరు: రోడ్డుపై నడిచి వెళ్తున్న మహిళను లారీ ఢీకొన్న ఘటనపై ఆదివారం రాత్రి మార్టూరు పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. ఎస్సై కమలాకర్ వివరాల మేరకు.. ఇసుకదర్శి గ్రామానికి చెందిన మురకొండ అంజమ్మ శుక్రవారం సాయంత్రం పొలం నుంచి సర్వీస్ రోడ్డులో ఇంటికి వెళ్తోంది. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న లారీ అంజమ్మను ఢీ కొట్టింది. ఈప్రమాదంలో తీవ్రగాయాలైన అంజమ్మను స్థానికులు గుంటూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. గుంటూరులోని కొత్త పేట పోలీసు స్టేషన్ అంజమ్మ ఆదివారం ఇచ్చిన ఫిర్యాదుపై మార్టూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నూతన ఎస్సైగా వెంకటేశ్వర్లు

అద్దంకి: పట్టణ పోలీసు స్టేషన్ నూతన ఎస్సైగా వెంకటేశ్వర్లు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో కొరిశపాడు స్టేషన్‌లో ఎస్సైగా పనిచేశారు. ఎస్సై వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు చెప్పారు. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ప్రజలు దుకాణదారులు సహకరించాలని కోరారు. అనంతరం ఎస్సై రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్యను మర్యాద పూర్వకంగా కలిసి బొకేఅందజేశారు.



చైతన్యకు బొకే అందిస్తున్న ఎస్సై వెంకటేశ్వర్లు